క్లుప్తంగా

జలశక్తి అభియాన్‌పై అవగాహన



వినుకొండ(నూజెండ్ల): జలశక్తి అభియాన్ కార్యక్రమంపై నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో టి.వీరభద్రాచారి పాల్గొని మాట్లాడుతూ జలశక్తి అభియాన్ కార్యక్రమం ఉద్దేశం, నీటివనరులను పెంపొందించుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, వెలుగు సీసీలు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, ఫ్యాన్లు అందజేత



ఈపూరు: యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కొచ్చర్ల సెక్టార్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కొచ్చర్ల ఉప్పరపాలెం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెనుమల వెంకటేష్ సహకారంతో ఫ్యాన్లు, కుర్చీలు, చాపలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూరాకుల శ్రీదేవి, ఫౌండేషన్ ప్రెసిడెంట్ పమిడిపల్లి అనిల్, బేతంజర్ల యోగేశ్వరరావు, పమిడిపల్లి ఇశ్రాయేలు, కూరాకుల బుల్లినాయుడు, తిప్పనబోయిన శారా, బండిరాజు, చిందుకూరి నరసింహారావు పాల్గొన్నారు.

చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు మరో అవార్డు



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ జాతీయ చిత్రకారుడు డాక్టర్ వజ్రగిరి జెస్టిక్‌కు జాతీయ కుంచె గురు అవార్డు లభించింది. కర్ణాటక రాష్ట్ర చిత్రకారుల సమాఖ్య, భారతీయ నామఫలక కుంచె కళావిరద సంఘ్ వారు బెంగళూరులో జాతీయ స్థాయిలో నిర్వహించి చిత్రకారుల మహాసభలో జాతీయ కుంచె గురు అవార్డును ప్రదానం చేశారని ఆయన తెలిపారు. అవార్డు పొందిన జెస్టిస్‌ను రాజకీయ ప్రముఖులు, కవులు, కళాకారులు, పాస్టర్‌లు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు. మరెన్నో అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



నరసరావుపేట టౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే నడిపిన వారితో పాటు వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని వన్‌టౌన్ సీఐ విజయ్ చరణ్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సరైన పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో అధిక శాతం మైనర్ యువకులు నడపడంతో తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ మరోసారి మైనర్లకు నడపడానికి వాహనాలు ఇస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామన్నారు. వాహనదారులు విధిగా వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని లేకుంటే చట్ట ప్రకారం మొదట జరిమానా, రెండవసారి పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

ఉన్నత పాఠశాలలో ప్రత్యేకాధికారి తనిఖీ



రొంపిచర్ల: మండలంలో కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి కె.సూర్యప్రకాష్‌రెడ్డి సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పాఠశాలలో గల రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టీలను, తాగు నీటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కింద తయారు చేసిన వంటలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ సి.హెచ్.లక్ష్మీకుమారి, ఎంఇఓ-1 హవీలా, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డలకు శ్రీరామరక్ష

- వేర్వేరు ప్రాంతాల్లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- ఎస్సీ, ఓసీ అంగన్‌వాడీల్లో అవగాహన సదస్సులు



లింగారావుపాలెం ఓసీ సెంటర్లో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



నాదెండ్లలో తల్లిపాల వారోత్సవంలో పాల్గొన్న డీజీపీవో భాస్కర్‌రెడ్డి, అధికారులు

యడ్లపాడు: తల్లిపాలే తమ బిడ్డలకు శ్రీరామ రక్ష అని సొలస సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.జోజమ్మ చెప్పారు. మండలంలోని లింగారావుపాలెం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని ఓసీ, ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల విశిష్టతపై అవగాహన సమావేశాలను ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలు, తల్లుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన జోజమ్మ మాట్లాడుతూ బిడ్డపుట్టిన మొదటి గంటలోనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం తల్లిపాల ప్రయోజనాలు వివరించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.పున్నమ్మ, పి.సుధారాణి, కె.అనురాధ, గ్రామంలోని తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

నాదెండ్ల: బిడ్డ పుట్టిన గంట వ్యవధిలోనే తల్లిపాలు ఇవ్వాలని, దీంతో బిడ్డ వ్యాధినిరోధక శక్తి పెరిగి జీవితాంతం పూర్తి ఆరోగ్యంతో ఉండేందుకు దోహదపడుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శాంతకుమారి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల ఎస్సీ ప్రాథమిక పాఠశాల సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం రెండో రోజు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి డీజీపీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంఈవో కృష్ణారెడ్డి, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ హాజరయ్యారు.

సీడీపీవో శాంతకుమారికి షోకాజ్ నోటీసులు

నాదెండ్ల ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన డీజీపీవో భాస్కర్‌రెడ్డి, బోర్డుపై పల్నాడు జిల్లాకు బదులు గుంటూరు జిల్లా అని ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పేరు మార్చకపోవటంపై సీడీపీవో శాంతకుమారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్‌ను ఆదేశించారు. పలుమార్లు జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ భవనాలపై జిల్లా పేరును పల్నాడు జిల్లాగా మార్చాలని ఆదేశించినా నిర్లక్ష్యంగా వ్యవహరించటంపై అసహనం వ్యక్తం చేశారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి : మండలంలోని మేళ్లవాగు గ్రామంలో ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎం.వినూత్న పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లిపాలు శ్రేష్ఠమైనవని, బిడ్డకు రోగనిరోధక శక్తిని పెంచుతుందని తెలిపారు. తల్లిపాలు బిడ్డలకు తప్పకుండా తాగించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మస్తాన్‌బీ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశలు, ఆయాలు, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.



నాదెండ్లలో తల్లిపాల వారోత్సవంలో పాల్గొన్న డీజీపీవో భాస్కర్‌రెడ్డి, అధికారులు



బొల్లాపల్లిలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం. వినూత్న

చిన్నారుల ఆధార్ నమోదు పురోగతి పెంచాలి

మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి

శావల్యాపురం: అంగన్‌వాడీసెంటర్లలో చిన్నారుల ఆధార్ నమోదు పురోగతి వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పూరు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటరు సందర్శించారు. ఈసందర్భంగా మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ఆధార్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేసి 0-6 సంవత్సరాలలోపు చిన్నారులు అంగన్‌వాడీ సెంటర్లలో విద్యాభ్యాసం చేసే వారందరూ ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఆధార్ నమోదు పురోగతిలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలకపాత్ర పోషించి నూరుశాతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం సెంటరుకు వస్తున్నా చిన్నారుల విద్యాభాస్యం బరువు, ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలు రికార్డులు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు కోమిటినేని అశోక్‌చౌదరి, ఆళ్ళ యుగందర్, సెంటరు కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎస్సీ వర్గీకరణ అంశం పరిష్కారంపై బీజేపీ మోర్చా నాయకులు



డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఇత్తడి కిరణ్, జిల్లా అధ్యక్షులు మేళం మధుబాబు మాట్లాడుతూ దేశంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో 30ఏళ్ల ఎస్సీ వర్గీకరణ సమస్యకు ఒక పరిష్కారం లభించిందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రధానమంత్రికి సమస్యను తెలియచేయటంతో సుప్రీం కోర్టు ద్వారా వర్గీకరణ అంశం సఫలీకృతం చేశారన్నారు. నాయకులు కాకుమాను కోటేశ్వరరావు, అంజనరెడ్డి, పెనుగొండ వెంకటేశ్వరరావు, మట్ట ప్రసాద్, బత్తుల మురళి, అమ్మ జిలాని పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో చేరకుంటే ఇతరులకు కేటాయిస్తాం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట: టిడ్కో గృహాల లబ్ధిదారులు వారికి కేటాయించిన గృహాల్లో తప్పనిసరిగా చేరాలని... అలా కాకుండా తాళాలు వేసి ఉంటే ఆ ఇళ్లు ఇతరులకు కేటాయిస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మంచినీటి చెరువులకు వెళ్లే మార్గంలో ఉన్న టిడ్కో గృహ సముదాయాన్ని అధికారులతో కలసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంతమంది గృహ లబ్ధిదారులు వారికి కేటాయించిన గృహాలను స్వాధీనం చేసుకొని తాళాలు వేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ గృహాలకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలో లబ్ధిదారులకు మేలుచేసే విధంగా చర్యలు తీసుకోబోతున్నారని వెల్లడించారు. అంతకు ముందు ఫిల్టర్ హౌస్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, అర్బన్ సీఐ పి.రమేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాగర్ నీటితో తాగునీటి చెరువులు వేగంగా నింపాలి

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామ రక్షిత మంచినీటి పథకం చెరువును శుక్రవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. గత మూడు రోజులుగా చెరువుకు సాగర్ జలాలు చేరుతున్న విషయం విదితమే. మొదటి చెరువు ఇప్పటికే 75 శాతం నిండగా, మరో చెరువుకు నీరు చేరుతున్నాయి. ఆదివారం ఉదయం నాటికి సాగర్ జలాలు నిలిచిపోనున్నాయి. ఈలోగానే రెండు చెరువులు పూర్తిగా నింపాలని పంచాయతీ, సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆదేశించారు. ఆయనతో పాటూ కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు వలేటి హిమంతరావు, పెనుమల జాన్‌బాబు, డీజీపీవో ఎంవీ భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు, నాయకులు జంపని శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. గత కొద్దిరోజులుగా సాగర్ జలాలు చేరుతున్న తరుణంలో శుక్రవారం నాటికి తుర్లపాడు మేజర్ పరిధిలోని అప్పాపురం, ఎండుగుంపాలెం, నాదెండ్లలోని ఒక చెరువు నూరుశాతం నిండాయి. కనపర్రు 95 శాతం, నాదెండ్ల రెండో చెరువు 50 శాతం నిండాయి. గణపవరం 75 శాతం నిండాయి. పీబీసీ పరిధిలో చందవరం నూరుశాతం నిండగా, గొరిజవోలు 80 శాతం, చిరుమామిళ్ళ మేజర్ పరిధిలోని సంకురాత్రిపాడు, జంగాలపల్లె, చిరుమామిళ్ళ పూర్తిస్థాయిలో నిండినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

దోమలతో అప్రమత్తంగా ఉండాలి

- పట్టణంలోని నాలుగు వార్డుల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్



తొమ్మిదో వార్డులో రోడ్డు ఊడ్చుతున్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: దోమల కారణంగానే వ్యాధుల వ్యాప్తి తీవ్రమవుతోందని, దోమలు పెరిగే ప్రాంతాలన్నింటినీ ఫాగింగ్, డీ వార్మింగ్ చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మున్సిపల్ అధికారులకు సూచించారు. శుక్రవారం పురపాలకసంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని 6,9,18, 27వ వార్డుల్లో చేపట్టిన ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. చీపురుపట్టి రోడ్లు ఊడ్చారు. కాలువలు శుభ్రం చేశారు.

ఫాగింగ్ నిర్వహించారు. కాలువల సమీపంలో పెరిగిన పిచ్చి మొక్కల్ని కట్టర్లతో తొలగించారు. దోమల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనరు సి.రవిచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు వాసిరెడ్డి రవి, క్రాంతికుమార్, పారిశుద్ధ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మండల తహసీల్దార్లు





జెట్టి విజయశ్రీ , వెంకట రమణ



షేక్ మొహమ్మద్ హుస్సేన్

ఈపూరులో అందె నళిని

ఈపూరు: స్థానిక తహసీల్దార్‌గా అందె నళిని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన దిలీప్ కుమార్ సొంత జిల్లాకు బదిలీపై వెళ్లడంతో సత్తెనపల్లిలో తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న నళిని ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా ఈపూరు మండలానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

యడ్లపాడు తహసీల్దార్‌గా జెట్టి విజయశ్రీ

యడ్లపాడు: మండల నూతన తహసీల్దార్‌గా జెట్టి విజయశ్రీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం యడ్లపాడు మండల తహసీల్దార్‌గానూ, నాదెండ్ల ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తు మొహమ్మద్ అష్రిఫున్నిసాబేగం బెల్లంకొండ మండలానికి బదిలీ అయ్యారు. దీంతో ఆమె స్థానంలో అమరావతి మండల తహసీల్దార్‌గా చేస్తూ ఎన్నికల విధుల నిమిత్తం ప్రకాశం జిల్లా ఒంగోలుకు వెళ్లిన జెట్టి విజయశ్రీ తిరిగి యడ్లపాడు మండల తహసీల్దార్‌గా వచ్చారు.

ఇక్కడి వారు అక్కడ..వారు ఇక్కడ

రెవెన్యూ అధికారుల సాధారణ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఎన్నికల డ్యూటీలో భాగంగా పోట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు ఎన్నికల విధులకు వెళ్లిన ఏవీ రమణ యడ్లపాడు మండల తహసీల్దార్‌గా, నాదెండ్ల మండల తహసీల్దార్‌గా జెట్టి విజయశ్రీ నియామకం చేస్తూ జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం వీరిద్దరు రెండు మండలాలను సందర్శించి, ఎవరి మండలాల్లో వారు చేరారు. అయితే వర్క్ ఎరేంజ్‌మెంట్‌లో భాగంగా అక్కడి వారు ఇక్కడ, ఇక్కడివారు అక్కడికి వెళ్లి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వీరు జీతభత్యాలు వారికి కేటాయించిన మండలాల్లోనే తీసుకుంటూ, విధులు మాత్రం ఒకరికి కేటాయించిన మండలంలో మరొకరు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

చిలకలూరిపేట తహసీల్దార్‌గా హుస్సేన్

చిలకలూరిపేటటౌన్: మండలం నూతన తహసీల్దార్‌గా షేక్ మొహమ్మద్ హుస్సేన్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జి.సుజాత ఎన్నికల నిమిత్తం ప్రకాశం జిల్లాకు వెళ్లగా అదే జిల్లా నుంచి జ్వాలా నరసింహం ఇక్కడకు వచ్చారు. తాజాగా జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల జ్వాలా నరసింహం సొంతజిల్లాకు వెళ్లగా, జి.సుజాత జిల్లాలోని క్రోసూరు మండలానికి బదిలీ అయ్యారు. దీంతో చిలకలూరిపేట మండల తహసీల్దార్‌గా ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఇక్కడకు వచ్చి శుక్రవారం విధులకు హాజరయ్యారు.

నాదెండ్ల తహసీల్దార్‌గా వెంకటరమణ

నాదెండ్ల: మండల తహసీల్దార్ ఆలపాటి వెంకటరమణ డిప్యూటేషన్‌పై శుక్రవారం విధుల్లో చేరారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు గురువారం జెట్టి విజయశ్రీ తహసీల్దార్‌గా విధుల్లో చేరారు. అయితే 24 గంటలు గడవక ముందే విజయశ్రీ యడ్లపాడు తహసీల్దార్‌గా, యడ్లపాడు తహసీల్దార్‌గా నియమితులైన వెంకటరమణ నాదెండ్లకు డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. గతంలో వెంకట రమణ నాదెండ్ల మండల తహసీల్దార్‌గా పనిచేశారు. ఎన్నికలకు ముందు సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ఇక్కడి నుండి బదిలీపై వెళ్లారు. తిరిగి నాదెండ్ల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చిలకలూరిపేట రూరల్ సీఐగా సుబ్బానాయుడు



చిలకలూరిపేటటౌన్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తానని చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు చెప్పారు. ప్రస్తుతం ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాసరెడ్డి పల్నాడు జిల్లా వీఆర్‌కు వెళ్లగా, ఆయనస్థానంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విభాగంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న బి.సుబ్బనాయుడు బదిలీపై వచ్చారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన సుబ్బనాయుడికి మూడు మండలాలకు చెందిన ఎస్ఐలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలనిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

రూరల్ సీఐగా పసుపులేటి రామకృష్ణ



నరసరావుపేట రూరల్: నరసరావుపేట రూరల్ సీఐగా పసుపులేటి రామకృష్ణ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వేమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను పలువురు ఎస్ఐలు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్‌లో సమస్యాత్మక గ్రామాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రశాంతత నెలకొనే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని, పుట్టినరోజు వేడుకల పేరిట రోడ్లపై యువకులు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మౌలిక వసతులు కల్పించండి

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం శివారులో ఉన్న అశ్వకుల్లఖాన్ కాలనీలో రోడ్లు, సైడ్ కాలువలు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం బాబాపేట గేటు వద్ద నియోజకవర్గం ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎం సీనియర్ నాయకులు వై. వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

జగదాంబకు ఆషాఢసారె



ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వాసవీ కామధేను క్లబ్, వూరా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ఆలయాలలోని అమ్మవార్లకు ఆషాడ సారె సమర్పించారు. మహిళలు శివుని బొమ్మ వద్ద నుంచి శోభాయాత్ర నిర్వహించుకుంటూ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు, అంకమ్మ తల్లి, పాతూరు శివాలయం పార్వతీ అమ్మవార్లకు సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు వూరా భాస్కరరావు, లక్ష్మీ సుజాత, చలువాది చరిత, సరస్వతి, మద్ది బాలసుబ్రహ్మణ్యం, చేగు వెంటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. –నరసరావుపేట ఈస్ట్

సంక్షిప్త వార్తలు

ఉచిత పశువైద్య శిబిరం

రొంపిచర్ల: మండలంలో కర్లకుంటలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో పాల్గొన్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కాంతారావు మాట్లాడుతూ పశుపెంపకందారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు, పశు వైద్యులు డాక్టర్ సాయి మహేష్ రెడ్డి, కరుణాకర రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వంశీ, శ్రీకాంత్, గణేష్, గోపాల్ మిత్రలు దొండేటి కృష్ణారెడ్డి, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

వసతులు మెరుగుపరచాలి

నాదెండ్ల: నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు మెరుగు పరచాలంటూ ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, తహసీల్దార్ ఏవీ రమణకు శుక్రవారం వినతిపత్రాలు అందించారు. వర్షం కురిస్తే పాఠశాల ఆవరణలో వర్షపు నీరు పారుదల లేక నిల్వ ఉండి విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని, విద్యార్థులు ఆటలాడేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పచ్చదోమను నియంత్రించాలి

చిలకలూరిపేట: పత్తిపంటలో పచ్చదోమ ఉధృతి నివారణకు రైతులు తగు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాధికారి టి.శ్రీలత చెప్పారు. మండలంలోని కావూరు గ్రామంలో పత్తిపంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం 25-35 రోజుల వ్యవధిలో ఉన్న పత్తిపంటలో పచ్చదోమ ఉధృతి ఎక్కువగా ఉందని తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికలు నిబంధనల ప్రకారం జరగాలి

బొల్లాపల్లి: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఎంఈవో-1 సయ్యద్ జఫ్రుల్లా అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ప్రధానోపాధ్యాయుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈ నెల 8న ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయని ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశాన్ని పాఠశాల బోర్డులో ప్రదర్శించాలని చెప్పారు.

విగ్రహాలకు శంకుస్థాపన

యడ్లపాడు: మండలంలోని మైదవోలు గ్రామంలో ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో బాబూజగ్జీవన్ రామ్, బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. గ్రామంలోని ఎస్సీకాలనీకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు హాజరయ్యారు. గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన ఎమ్మార్పీస్ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు దావల సుబ్బారావు, వెంకటప్రసాద్ నేతృత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా సమావేశాన్ని జయప్రదం చేయండి

ఈపూరు : కేంద్రం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రజా పోరాటాలు చేస్తుంది సీపీఐ అని వినుకొండ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో నరసరావుపేటలో జరిగే జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండలంలోని ముప్పాళ్ల, చిట్టాపురం, వనికుంట, ఈపూరు, అగలూరు, కొండ్రముట్ల, కొండ్రముట్ల పాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మోదీ నాయకత్వంలోని బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద చర్యలను, కార్పొరేట్ శక్తులకు సంపదను కట్టిపెట్టే విధానాలపై సీపీఐ పోరాటం చేస్తుందన్నారు.

అనంతరం ఈ నెల 5న జరిగే జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సీపీఐ నాయకులు ఊట్ల రామారావు, సూరే అప్పారావు పాల్గొన్నారు.